క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



హస్నాబాద్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికురాలు

దుద్యాల్: బోనాల పండుగ సందర్భంగా గ్రామాల్లో కార్మికులు పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, హస్నాబాద్, కుదురుమల్ల, లగచెర్ల, హకీంపేట, పోలేపల్లిలో ప్రధాన వీధులు, ప్రధాన రహదారులు, గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లే మార్గాల్లో పారిశుద్ధ్య పనుల అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దీంతో పల్లెల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొంది.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



బాధితుడికి చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని మాజీ సర్పంచ్ లక్ష్మయ్య అన్నారు. మండల పరిధి రాకొండా గ్రామానికి చెందిన రెడ్యానాయక్ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించగా.. ఆ చెక్కును మాజీ సర్పంచ్ సోమవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గురునాథ్‌రెడ్డి, బద్రి, శ్రీనివాస్, నర్సింలు, మహిపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి అనుగ్రహంతోనే ఆరోగ్యం పదిలం



ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

దోమ: గ్రామ దేవతల అనుగ్రహంతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి లింగన్‌పల్లి గ్రామంలో పోచమ్మతల్లి నూతన విగ్రహ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా రెండు రోజులుగా అమ్మవారికి జలాభిషేకం, ధాన్యాభిషేకం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా బుధవారం ప్రతిష్ఠించే తల్లి విగ్రహానికి అర్చకులు శేషాద్రిరావు ప్రత్యేక పూజలు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.

ఊరెళ్తే సమాచారం ఇవ్వండి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

బొంరాస్‌పేట: దొంగలకు అవకాశం ఇవ్వరాదని, ఊరికి వెళ్తే సమాచారం ఇవ్వాలని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధి రేగడిమైలారం అంబేడ్కర్ కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఇంట్లోని విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు లేదా బంధువులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సీసీ టీవీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందులో ఎస్ఐ ఎండీ రవూఫ్, సిబ్బంది ఉన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు ముదిరాజ్‌ల శుభాకాంక్షలు



జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘం నాయకులు

పరిగి: తెలంగాణ ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సోమవారం సంఘం నియోజకవర్గ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేయాలని జ్ఞానేశ్వర్‌ను కోరారు. ఇందులో ముదిరాజ్ మహాసభ నాయకుడు ముకుంద నాగేశ్వర్, చిన్న నర్సింహులు, రామస్వామి, రామకృష్ణ, సత్యనారాయణ, నర్సింలు ఉన్నారు.

పేరుకే క్రీడా ప్రాంగణం

- అందుబాటులోకి రాని వైనం
- బోర్డులకే పరిమితం
- తుప్పపడుతున్న సామగ్రి
- పట్టించుకోని అధికారులు



కందనెల్లితండాలో బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం

పెద్దేముల్: పల్లెల్లో క్రీడా కారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. లక్షల రూపాయలు ఖర్చు చేసింది. కానీ.. అధికారుల నిర్లక్ష్యంతో సర్కారు లక్ష్యం నీరుగారిపోతోంది. కొన్ని గ్రామాల్లో నేటికీ పూర్తిగాక.. క్రీడా పరికరాలు, తదితర సామగ్రి తుప్పుపడుతున్నాయి. పలు చోట్ల ప్రాంగణాలు ప్రారంభించినా.. అందులో రాళ్లరప్పలు ఉండటంతో ఆటగాళ్లు వినియోగించుకోవటానికి ఆసక్తి చూపడం లేదు. మంజూరు చేసిన ప్రాంగణాల్లో ఇప్పటి వరకు 70 శాతం పనులు కూడా పూర్తి కాలేదన్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో బోర్డులకే పరిమితమయ్యాయి. పెద్దేముల్ మేజర్ పంచాయతీలో అసలు క్రీడా ప్రాంగణమే ఏర్పాటు చేయలేదు. కానీ.. బోర్డు ఏర్పాటుకు సామగ్రిని సిద్ధంగా ఉంచారు.

రాళ్లురప్పలు..

మండల పరిధి 37 గ్రామాలకు క్రీడా ప్రాంగణాలు, 43 కిట్లు మంజూరు అయ్యాయి. కిట్లు కూడా మండలాలకు వచ్చాయి. ఒక ప్రాంగణానికి సుమారు 20 గుంటల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. కానీ మైదానాల పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కందనెల్లితండాలో మైదానం ఏర్పాటు చేసినప్పటికీ.. అందులో పెద్ద పెద్ద బండరాళ్లు ఉండటంతో ఎలా ఆడుకోవాలని యువకులు ప్రశ్నిస్తున్నారు. గాజీపూర్, మారేపల్లి, బండమీదిపల్లి, ఖానాపూర్, గోట్లపల్లి, బండపల్లిలో పనులు పూర్తయ్యాయి. కానీ నేటికీ అందుబాటులోకి రాలేదు. ఇదిలా ఉండగా.. ప్రాంగణాలు ఏర్పాటు అయిన కొన్ని గ్రామాలకు కిట్లు అందకపోగా.. ప్రాంగణాలు పూర్తి కాని పలు గ్రామాలకు కిట్లు పంపించడం గమనార్హం. పలు చోట్ల స్పోర్ట్స్ కిట్లు పక్కదారి పట్టినట్లు సమాచారం.

వినియోగంలోకి తేవాలి



క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తేవాలి. అప్పుడే క్రీడాకారులకు ప్రోత్సాహకంగా ఉంటుంది. వేసవి సెలవుల్లో ఆటగాళ్లకు సరైన మైదానాలు లేక పంటపొలాల్లో క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలు ఆడుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– నసీర్, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు, గాజీపూర్

అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తాం



గ్రామగ్రామాన క్రీడా ప్రాంగణాలు ఉండేలా చర్యలు తీసుకుంటాం. మండల కేంద్రంలో ఏర్పాటు చేయలేదన్న విషయం తమ దృష్టికి రాలేదు. విచారణ చేపడతాం. మిగతా ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులతో తనిఖీలు చేస్తాం. కిట్ల గురించి ఆరా తీస్తాం. పనులు మొదలు పెట్టని చోట ప్రారంభిస్తాం.

– రతన్‌సింగ్, ఎంపీఓ, పెద్దేముల్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనంతగిరి: రెండు దశాబ్దాల అనంతరం పాఠశాల వేదికగా బాల్యమిత్రులందరూ ఏకమయ్యారు. ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఆడుతుపాడుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. వికారాబాద్ పట్టణం కొత్తగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు.. సోమవారం ఘనంగా పూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో ఆప్యాయంగా మాట్లాడారు. క్షేమ సమాచారం కనుగొన్నారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నాటి క్రమశిక్షణే.. నేడు ఉన్నత స్థానంలో నిలబెట్టిందని పేర్కొన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు, ఆపద వచ్చినా అందరం కలిసి ముందుకు సాగుతామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

సమితి జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ

తాండూరు రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ అన్నారు. సోమవారం మండల పరిధి జినుగుర్తి గ్రామంలో సమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే రాష్ట్రంలో పింఛన్లు పెరిగాయని గుర్తు చేశారు. మందకృష్ణ ఆధ్వర్యంలో 29 సంవత్సరాలుగా వర్గీకరణకు పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధాని మోదీ అనుకూలంగా ఉన్నారని వెల్లడించారు. త్వరలో వర్గీకరణ పూర్తయి మాదిగలకు మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్ మాదిగ, దేవదాస్, బాలప్ప, వీరేశం, ఏలియా, దేవప్ప, రవి, మాణిక్యప్ప, వెంకటేశ్, జర్నప్ప, నర్సింలు, బాలరాజ్, కృష్ణ, అనంతయ్య, ముకుంద, శ్రీనివాస్, రామప్ప, వెంకట్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

మోమిన్‌పేట: మండల పరిధి ఎన్కేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పడేలా మొగులయ్య(65) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. రెండు పర్యాయాలు సర్పంచుగా, మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా సేవలు అందించారు. సోమవారం అంత్యక్రియలు జరిగాయి.

ఆలయ నిర్మాణానికి విరాళం

కుల్కచర్ల: శివాలయం నిర్మాణానికి మండల పరిషత్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం నాయకుడు వడ్ల రాజశేఖర్ రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఇందులో ఆలయ కమిటీ సభ్యులు చంద్రయ్య, ప్రకాశ్, సుంకరి వినోద్ ఉన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం



మదన్‌పల్లి రోడ్డు దుస్థితి

అనంతగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతలు ఏర్పడి.. అందులో వాననీరు నిలిచి వాహనదారులకు నరకం చూపెడుతున్నాయి. ప్రమాదాలూ జరుగుతున్నాయి. వికారాబాద్ మండల పరిధి మదన్‌పల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డు పొడవునా గోతులు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దెబ్బతిన్న రహదారుల్లో పయనించలేక పోతున్నామని పలువురు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆపద వస్తే.. అంబులెన్స్ రాదు!

- మండలానికి 108 వాహనం కరువు
- ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు



దౌల్తాబాద్: అత్యవసర సమయంలో ఫోన్ చేస్తే.. పరుగుపరుగున రావాల్సిన అంబులెన్స్‌లు మండల పరిధిలో కానరావు. 108 నంబర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం శూన్యం. దౌల్తాబాద్ మండలంలో మారుమూల ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. కాన్పులు, అత్యవసర పరిస్థితుల్లో ఫోనే చేస్తే.. మండలంలో అత్యవసర సర్వీసులు లేకపోవడంతో కొడంగల్, కోస్గి మండలాల నుంచి రావాల్సి ఉంటుంది. అవి సకాలంలో రాకపోవడంతో.. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని వాపోతున్నారు. 108 వాహనంలో ప్రథమ చికిత్సకు అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉండటం వలన బాధితులకు కొంతమేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది. మండలంలో 50 వేలకు పైగా జనాభా ఉన్నా.. అంబులెన్స్ లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని 108 వాహనం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలపై మాట్లాడండి

కందుకూరు: ఎస్సీల సమస్యలను పరిష్కరించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందేలా చూడాలని, దళితబంధు పథకం అమలు చేసేలా అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు.

గ్రామానికి నక్షబాటను కల్పించండి

- ఎమ్మెల్యే శంకర్‌కు చింతకుంటపల్లి వాసుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: గ్రామాన్ని సర్వే చేయించి అధికారిక నక్షబాట కల్పించాలని కేశంపేట మండల పరిధి చింతకుంటపల్లి గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఈ మేరకు షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చింతకుంటపల్లి గ్రామంలో సుమారు 700 ఎకరాల భూమి ఉందన్నారు. కానీ గ్రామానికి నక్షబాట లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ శివారులో ఉన్న భూములను సమగ్ర సర్వే చేయించి నక్షబాట జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. రెవెన్యూ నక్షబాట లేక పోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను రెవెన్యూ శాఖ మంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

యువతకు బుగ్గన్న జీవితం ఆదర్శం



బుగ్గన్న పైలాన్ వద్ద నాయకులు, సామాజిక కార్యకర్తలు

కుల్కచర్ల: బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం దక్కాలన్న సంకల్పంతో బుగ్గన్న యాదవ్ పోరాటం చేశారని అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ వెంకటయ్య అన్నారు. సోమవారం మండల పరిధి రాంరెడ్డిపల్లిలో పోరాటయోధుడు బుగ్గన్న పైలాన్ వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుగ్గన్న ఆశయసాధనకు యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బుగ్గన్న సతీమణి సునంద, కుమారుడు తరుణ్, బహుజన విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామన్న మాదిగ, ఆంజనేయులు, ఉపాధ్యాయులు వెంకట య్య, అంజనేయులు గౌడ్, సత్యయ్య గౌడ్, దస్త య్య, మహేశ్, దస్తగిరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్టాండు



బోసిపోయిన ప్రయాణ ప్రాంగణం

ధారూరు: బస్టాండు ఉన్నా.. అందులోకి బస్సులు రాకపోవడంతో అది వృథాగా మారింది. ధారూరు బస్టాండు ప్రధాన రోడ్డుకు మూడు ఫీట్ల కిందకు ఉండటంతో వర్షాకాలంలో ప్రయాణ ప్రాంగణం ఆవరణలోకి వర్షపు నీరు చేరి బురద మయంగా దర్శనమిస్తుంది. దీంతో సర్వీసులు లోపటికి రావటం లేదు. ఈ నేపథ్యంలో సంస్థ అధికారులు నీరు నిల్వ లేకుండా సోమవారం మట్టిని పోయించి చదును చేయించారు. అయినా డ్రైవర్లు ప్రాంగణంలోకి బస్సులు తీసుకురాకుండా.. రోడ్డు పై నుంచి అటే వెళ్తున్నారు. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిరీక్షిస్తుండటంతో.. బస్టాండ్ బోసిపోతోంది. తాండూరు, హైదరాబాద్, వికారాబాద్‌ల నుంచి వచ్చిన బస్సులు రోడ్డుపైనే ఆగి అటునుంచి అటే వెళ్తున్నాయి. బస్సులు బస్టాండులో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుడ్డు అ'ధర'హో..



దుద్యాల్: అధిక పోషకాలు ఉండే కోడిగుడ్ల ధరలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో హోల్‌సెల్ మార్కెట్లో వంద గుడ్ల ధర రూ.400–450 వరకు ఉండగా.. నేడు రూ.600 నుంచి రూ.650 వరకు పలుకుతోంది. ధర గురించి వ్యాపారులను వివరణ కోరగా.. కొడంగల్ ప్రాంతానికి మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదతర ప్రాంతాల నుంచి గుడ్లను దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, ధరలు మరింత పెరగవచ్చని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో ఒక గుడ్డు రూ.7కు విక్రయిస్తుండగా, గ్రామాల్లో రూ.8కి అమ్ముతున్నారు. పౌష్టికాహారం కోసం నిత్యం గుడ్లను తీసుకునే వారు.. వాటి ధర పైపైకి ఎగబాకుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. మాంసాహారాలు, కూరగాయల ధరలతో గుడ్లు పోటీ పడుతుండటంతో సామాన్యుడు విలవిల లాడుతున్నాడు. ధరలు ఇలా పెరుగుతూ పోతే.. ఏం తినాలో తెలియడం లేదని వాపోతున్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ శ్రేణులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, శివరాజ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలతో కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు సూర్యకాంతం, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కేశవులు, అంజిలయ్య, మైపాల్, శ్రీనివాస్, శంకర్ నాయక్, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, జానకీరాం, అంజిలయ్య, హన్మంతు, వెంకటయ్య, భీమయ్య, మహేశ్, శ్రీశైలం, రమేష్, గోపాల్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

గ్రామస్తుల అభ్యర్థనకు స్పందించిన డీఎం

చేవెళ్ల: బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండలంలోని ఆలూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలోని మెహిదీపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మూర్తి గ్రామానికి గతంలో వచ్చే బస్సును పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బస్సు గత కొన్ని రోజులుగా రాకపోవటంతో గ్రామస్తులకు ఇబ్బందిగా ఉందని ఇటీవల కొంతమంది నాయకులు డీఎంకు వినతిపత్రం ఇచ్చారు. తాజాగా సోమవారం మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు డీఎంను కలిశారు. దీంతో బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనంతరాములు, కె.నర్సింలు, ఎం.నర్సింలు, శంకరయ్య, సీహెచ్.రాజు, సీహెచ్.నర్సింలు ఉన్నారు.



పాఠశాల వేదికగా నెత్తిన బోనంతో విద్యార్థినులు



నెత్తిన బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న విద్యార్థినులు

బోనమెత్తిన చిన్నారులు

పోతురాజుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు



పోతరాజుల వేషధారణలో విద్యార్థుల నృత్యం

తాండూరు టౌన్: ఆషాఢం బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం తాండూరు పట్టణంలోని శ్రీసాయిమేధ పాఠశాలలో విద్యార్థినులు అమ్మవారికి బోనమెత్తగా, విద్యార్థులు పోతరాజు వేషధారణలో అలరించారు. డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ ఊరేగింపుగా శివాజీచౌక్ నవరమ్మ ఆలయానికి చేరుకున్నారు. చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. దైవభక్తి, దేశభక్తి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. ఇందులో ప్రిన్సిపాల్ సజిత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పోచమ్మకు బోనాలు



నెత్తిన బోనంతో మహిళలు

పరిగి: మండల పరిధి మిట్టకోడూర్ గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నెత్తిన బోనంతో మహిళలు పురవీధుల గుండా డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.